ఎక్కడి చెత్త అక్కడే..

- పల్లెల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- డంపింగ్ యార్డులుగా మారిన కాలనీలు
- కలుషితమవుతున్న తాగునీరు
- పట్టించుకోని అధికారులు

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే చిన్నచిన్న పనులను చేయడంలో పూర్తిగా విఫలమైంది. పారిశుద్ధ్యంపై దృష్టి సారించకపోవడంతో పల్లెలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వీధులు మినీ డంపింగ్ యార్డులుగా మారిపోయాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదు.




నరుకూరు - తోటపల్లిగూడూరు మార్గంలో చెత్తదిబ్బలు

తోటపల్లిగూడూరు: మండలంలోని 22 పంచాయతీల్లో సుమారు 55 వేలమంది జనాభా నివాసం ఉంటున్నారు. ఆయా పంచాయతీల్లో అధికశాతం గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య ఉంది. కలుషిత నీటితో జనం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడ చూసిన మురుగు నిల్వలు దర్శనమిస్తున్నాయి. పల్లెల్లో అంతంతమాత్రంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ ఈ మురుగు నిల్వల కారణంగా మరింత దిగజారిపోయింది. కాలువల్లో నీరు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారిపోయింది. ఇక పంచాయతీల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమవుతోంది. కుళాయిల చుట్టూ నీరు నిల్వ ఉంటోంది. కలుషిత నీటి కారణంగా ప్రజలు రోగాలకు గురవుతున్నారు. అలాగే చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా చేపట్టాల్సిన చెత్త సేకరణ నిలిచిపోవడంతో పలు కాలనీలు డంపింగ్ యార్డులుగా మారిపోయాయి. ఎక్కడికక్కడే చెత్తకుప్పలు, పేడదిబ్బలు పేరుకుపోవడంతో దోమల దాడి పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో సాధారణ జ్వరాల నుంచి డెంగీ వంటి విషజ్వరాలతో గ్రామీణులు వైద్యశాలల చుట్టూ తిరుగుతున్నారు.

పట్టించుకోకుండా..

పల్లెల్లో మెరుగైన పారిశుద్ధ్యానికి కృషి చేయాల్సిన అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదనే ఆరోపణలున్నాయి. తాగునీటి సరఫరాకు సంబంధించి పదిహేను రోజులకోసారి ట్యాంక్‌లను శుభ్రం చేయాల్సి ఉంది. వారం వారం కుళాయిల చుట్టూ చెత్తాచెదారాలను తొలగించి బ్లీచింగ్ చల్లాలి. కానీ అధిక శాతం గ్రామాల్లో ఇలాంటి చర్యలేవి ప్రస్తుతం కనిపించడం లేదు. కాలువల్లోని మురుగును ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేయించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో రోడ్ల వెంబడి పోగు చేసే చెత్తను డంపింగ్ యార్డులకు తరలించే విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాల్సిన వైద్యశాఖ అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యారనే విమర్శలున్నాయి.

దోమలు విజృంభిస్తున్నాయి



గ్రామంలో కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. రోడ్లపై చెత్త పేరుకుపోతోంది. పారిశుద్ధ్యం లోపించడంతో రాత్రివేళల్లో దోమలతో యుద్ధమే చేయాల్సి వస్తోంది.

– అంజి, వావూరివారికండ్రిగ, వరిగొండ పంచాయతీ

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటాం. ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్యసిబ్బందికి సూచించాం. ప్రత్యేక వైద్యశిబిరాలు పెట్టాలని ఆదేశించాం.

– వసుంధరాదేవి, ఈఓపీఆర్డీ, తోటపల్లిగూడూరు



ముంగళదొరువులోని ఓ వీధిలో నిలిచిన మురుగునీరు



మండల కార్యాలయం పక్కనే అపరిశుభ్ర వాతావరణంలో తాగునీటి కుళాయి

క్లుప్తంగా

చేపల వేట బంద్



నేలటూరు తీరంలో ఫైబర్ బోట్లు

ముత్తుకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణం ప్రతికూలంగా మారడంతో మత్స్యకారులు చేపల వేటను నిలిపివేశారు. నేలటూరు, కృష్ణపట్నం, ఈపూరు పట్టపుపాళేల్లో బోట్లు, వలలను తీరంలో భద్రపరిచిన గంగపుత్రులు ఇళ్లకే పరిమితమయ్యారు. సముద్రంలో అలలు ఎగసిపడటం, గాలుల కారణంగా బోట్లు వెళ్లలేకపోతున్నాయని చెబుతున్నారు. మండలంలో బుధవారం వర్షం కురిసింది. పొగమంచు దట్టంగా కమ్ముకుంది.

వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి.

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



సదస్సులో పాల్గొన్న అధికారులు

మనుబోలు: మండలంలోని చెరుకుమూడి, ముద్దుమూడి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 43 అర్జీలు అందినట్లు ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య తెలిపారు. కార్యక్రమాల్లో సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్‌ఐ నారాయణ, వీఆర్వో గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి వినతి



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలంటూ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజకు ఆమె కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24వ వార్డులోని నారాయణ స్కూల్ వెనుక వైపు ఓ అపార్ట్‌మెంట్ పక్కన డ్రెయినేజీ సమస్య ఉందని, దీంతో స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామని చైర్‌పర్సన్ వారికి హామీ ఇచ్చారు. రమేష్‌రెడ్డి, మస్తాన్, శ్రీధర్‌రెడ్డి, విజయ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు



అడ్డదిడ్డంగా నిలిపిన ఆటోలు

పొదలకూరు: పట్టణంలో ట్రాఫిక్ రోజురోజుకు పెరుగుతోంది. ఇటీవల వివిధ రకాల వాహనాల రాకపోకలు పెరగడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో దాదాపుగా వాహనాలన్నీ పట్టణం మీదుగా వెళ్లాల్సి ఉంది. చుట్టుపక్కల నాలుగు మండలాల నుంచి ఇదే మార్గంలో వెళ్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. పదుల సంఖ్యలో ఆటోలు, కంకర లారీల తాకిడి అధికంగా ఉంది. అంతేకాక కొందరు ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలుపుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సుమారు అరగంట సేపు నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా బస్టాండ్ సెంటర్, రామనగర్‌గేటు సెంటర్లలో సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రావెల్, కంకర లారీలు ఇదేమార్గంలో వెళ్తుండటంతో ఇరుకుగా ఉన్న రోడ్లపై ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో కొన్ని సందర్భాల్లో వాహనాలు బారులు తీరుతున్నాయి. యువకులు ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారం నడుపుతున్నారు. మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. గతంలో నెల్లూరు నుంచి పొదలకూరు మీదుగా సైదాపురం వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనుల కోసం ఇంజినీర్లు సర్వే పనులను నిర్వహించారు.

ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా పొదలకూరు సెక్రటరీ

పొదలకూరు: ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా పొదలకూరు పంచాయతీ సెక్రటరీ వి.శీనయ్య నియమితులయ్యారు. రెగ్యులర్ విధులు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆయన్ను తాత్కాలికంగా నియమించారు. ఈయనకు ముందు ఇనుకుర్తి పంచాయతీ సెక్రటరీ బాలకృష్ణయ్యను కొద్దిరోజులు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా బాధ్యతలు నిర్వహించారు. అయితే ఒత్తిడిని తట్టుకోలేక తప్పుకొన్నారు.

విద్యార్థుల కోసం ఆధార్ సేవలు

మనుబోలు: అపార్ కార్డుల్లో విద్యార్థుల నమోదు కోసం గురు, శుక్రవారాల్లో మనుబోలు సచివాలయం – 2లో ఆధార్ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు ఎంపీడీఓ జలజాక్షి బుధవారం తెలిపారు. కొంతకాలంగా మనుబోలు మండలంలోని సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సుమన మాట్లాడుతూ ఆధార్‌కార్డులో ఫోన్ నంబర్ లింక్, చిరునామా మార్పు, పుట్టిన తేదీ మార్పులకు గెజిటెడ్ సంతకంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం రూ.50 సర్వీస్ చార్జి వసూలు చేస్తామన్నారు. పుట్టిన తేదీ మార్పు కోసం డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ లేదా 10వ తరగతి మార్కుల జాబితా తీసుకురావాలన్నారు.

విద్యార్థులకు అవగాహన



కోవూరు: గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఆధునిక టెక్నాలజీపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలానికి తగినట్లు విద్యార్థులకు ఏఐ, ఐఓటీపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

మాజీ మంత్రి కాకాణి పరామర్శ



ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని పరామర్శిస్తున్న కాకాణి

తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుడు చిల్లకూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ప్రవీణ్ కుమార్‌రెడ్డి తండ్రి చిల్లకూరు సుధాకర్‌రెడ్డి మంగళవారం మృతిచెందారు. దీంతో కాకాణి వరిగొండకు వెళ్లి సుధాకర్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లిపూడి సునీల్‌రెడ్డి, కోటా శేఖర్‌రెడ్డి, గండవరపు శ్యామలమ్మ, ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



కోవూరు: మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమెన్స్ హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపికలు బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో నలుమూలల నుంచి దాదాపుగా 60 మంది పోటీల్లో పాల్గొని, జట్టుకు ఎంపికయ్యారు. వీరు బుచ్చిరెడ్డిపాళెంలోని రెయిన్‌బో ఇంగ్లిష్ మీడియం స్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 21, 22 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారు. కార్యక్రమంలో జిల్లా అడహక్ కమిటీ చైర్మన్ విక్టర్, వ్యాయామ ఉపాధ్యాయులు భీమతాటి వెంకటరమణయ్య, మధుసూదన్‌రావు, ప్రవీణకుమారి, శ్యామ్, ప్రదీప్ అజయ్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



కోవూరు : మాట్లాడుతున్న ఏడీఏ సుజాత



విడవలూరు : రామతీర్థంలో..

కోవూరు: రైతులు వరిసాగులో యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని ఏడీఏ సుజాత అన్నారు. మండలంలోని పాటూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం చలితీవ్రత ఉన్న దృష్ట్యా వరిలో జింక్ లోపం గుర్తించామని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఇందిరావతి, సహాయకులు మౌనిక, నారాయణ పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

విడవలూరు: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు సబ్సిడీపై ఆర్‌ఎన్‌ఆర్–15048 అనే వరి విత్తనాలను రైతులకు అందజేసినట్లు మండల ఏఓ పి.వెంకట కృష్ణయ్య తెలియజేశారు. మండలంలోని రామచంద్రాపురం, రామతీర్థం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం రామతీర్థంలోని పొలాలను సందర్శించారు. వీఏఏలు వెన్నెల, సాయి మహేష్ పాల్గొన్నారు.

మార్కెట్లోకి నూతన జేసీబీ



కోవూరు: కోవూరులోని ఎంఎస్ గోల్డ్ ఫీల్డ్స్ షోరూంలో సరికొత్త జేసీబీ 215 ఫ్యూయల్ మాస్టర్ ఎక్స్‌వేటర్ మెషీన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఎంఎస్ గోల్డ్ ఫీల్డ్స్ ఎండీ బీఎల్. కార్తీక్ మాట్లాడుతూ ఈ మెషీన్ మైనింగ్, క్వారీ సెగ్మెంట్లకు అనుకూలంగా డిజైన్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ జనరల్ మేనేజర్ డి.శీను, రీజినల్ సేల్స్ మేనేజర్ ఎం.జగన్ మాధవన్, ఏరియా మేనేజర్ ఇంద్రజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ తనిఖీలు

పొదలకూరు: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను డీఈఓ బాలాజీరావు బుధవారం తనిఖీ చేశారు. ముందుగా పట్టణంలోని డాన్‌బోస్కో స్కూల్‌కు వెళ్లి అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలబాలికల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

డిగ్రీ పరీక్షలకు 691 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 8,177 మందికి గానూ 691 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. నాయుడుపేటలోని వేమా డిగ్రీ కళాశాలలో ఒకరిని డిబార్ చేశారని వెల్లడించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్

మనుబోలు: బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ హెచ్చరించారు. మండలంలోని పిడూరుపాళెం గిరిజన కాలనీలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం జరిపిస్తే చట్ట ప్రకారం రెండేళ్ల కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సుబ్బమ్మ, ఎంఎస్‌కే సునీత, ఎంఎల్‌హెచ్‌పీ పూజిత, ఆశా కార్యకర్త రమ పాల్గొన్నారు.

హైవేపై పశువులు.. పొంచి ఉన్న ప్రమాదం



మేత మేస్తున్న ఆవులు

మనుబోలు: జాతీయ రహదారిపై ఆవులు, గేదెలు తిరుగుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల పరిధిలో పోర్టు క్రాస్‌రోడ్డు నుంచి బద్దెవోలు క్రాస్ రోడ్డు వరకూ సుమారు 12 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. రెండు రహదారుల మధ్యలో మొక్కలు పెంచారు. వర్షాకాలం కావడంతో గడ్డి పెరిగి పచ్చదనం పరుచుకుంది. దీంతో ఆవులు, గేదెలు మేత కోసం హైవే పైకి వెళ్తున్నాయి. ఈ క్రమంలో వేగంగా వెళ్లే వాహనాల కింద పడి పశువులు చనిపోవడమో లేదా ఇతరత్రా ప్రమాదాలకు కారణమవడమో జరుగుతోంది. అవి రహదారి వైపు రాకుండా యజమానులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

ఉత్సాహంగా క్రిస్మస్ క్యారల్స్



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న సెంటినరి తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ క్యారల్స్ ర్యాలీని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రార్థనలు చేశారు. తువ్వర సుధాకర్ ఇంటి వద్ద ప్రీ క్రిస్మస్ వేడుక చేశారు. కేక్ కట్ చేసి సంఘస్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘ కాపరి జాకోబు సుధీర్, చైర్మన్ సి.జొనాథన్, సెక్రటరీ సూరి నెహమ్యా, కోశాధికారి టి.ప్రదీప్, సండే స్కూల్ సూపరింటెండెంట్ బి.గిరీష, స్త్రీల సమాజం చైర్మన్ మీనాక్షి, సంఘ పెద్ద గోనె దయాకర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువుల విక్రయం



ముత్తుకూరు: అధికారుల పరిశీలన



కొడవలూరు: ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారి శ్రీహరి

ముత్తుకూరు: ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని మండల వ్యవసాయాధికారిణి జోత్స్న రాణి, ఇందుకూరుపేట వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి అన్నారు. వారు బుధవారం బ్రహ్మదేవి, ముత్తుకూరులో యూరియా అమ్మకాలు జరిగే దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాస్ పుస్తకంలో భూ విస్తీర్ణం, బయోమెట్రిక్ ఆధారంగా ఎరువుల అమ్మకాలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

- **కొడవలూరు:** ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలని ప్రత్యేక తనిఖీ అధికారి, సంగం వ్యవసాయాధికారి శ్రీహరి హెచ్చరించారు. మండలంలోని నార్తురాజుపాళెం, తలమంచిలోని ఎరువుల దుకాణాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, ఈ–పాస్ మెషీన్, స్టాక్ రిజిస్టర్‌లలో నమోదైన ఎరువుల నిల్వలు సమాంతరంగా ఉన్నాయా.. అని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాస్తవ ఎరువుల నిల్వలు, నమోదైన నిల్వల్లో వ్యత్యాసాలుంటే అమ్మకాలు నిలిపి వేస్తామన్నారు. ప్రతి దుకాణంలో తగినన్ని ఎరువుల నిల్వలు ఉంచాలని చెప్పారు. ప్రస్తుతం రైతులకు ఎరువుల ఆవశ్యకత అధికంగా ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు కలిగిస్తే దుకాణదారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వీఏఏలు ఎ.శివజ్ఞాన, ప్రసాద్‌లు ఉన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



తోటపల్లిగూడూరు: మండలంలోని విలుకానుపల్లి ప్రాథమిక పాఠశాల (జీసీ) విద్యార్థులకు కొందరు దాతలు బుధవారం క్రీడా దుస్తులను వితరణ చేశారు. తన సోదరుడు జ్యోతిబాబు జ్ఞాపకార్థం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్నేహలత క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి – 2 జయరామనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతల చేయూత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోపిరెడ్డి పావని, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ చిట్టెమ్మ, ఉపాధ్యాయ సంఘ నేత వెంకటేశ్వర్లు, టీచర్లు సత్యన్నారాయణ, అహ్మద్‌బాషా, ఖాదర్‌బాషా, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.